క్లుప్తంగా

11 నుంచి విశ్వకర్మ యజ్ఞం

కాకినాడ కల్చరల్: స్థానిక ఆనందభారతి గ్రౌండ్‌లో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పరిషత్, శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 13 తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లోక కల్యాణార్థం చేసే యజ్ఞ మహోత్సవంలో భక్తులు పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

కరప: మండల పరిధిలోని విశ్రాంత ప్రభుత్వోద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు, సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల నాయకుడు పెద్దిరెడ్డి తాతారావు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. హియరింగ్ సొల్యూషన్స్ (కాకినాడ) ప్రతినిధి ఎ.సతీష్ విశ్రాంత ఉద్యోగులకు వినికిడి పరీక్షలు నిర్వహించారు. వినికిడి లోపం ఉన్నవారికి ప్రత్యేక రిబేటుపై వినికిడి యంత్రాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు ఎంవీ రాఘవస్వామి, పి.నాగరాజు, కాకినాడ ఈశ్వరరావు, ఆర్.పెదసత్తిరాజు, వై.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్కను నాటి, ట్రీగార్డు ఏర్పాటు చేసిన డాక్టర్ బాదం బాలకృష్ణ తదితరులు

బాలాజీచెరువు: మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణానికి మేలు చేయాలని లయన్స్ పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పిలుపునిచ్చారు. లయన్స్‌క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ డి.రామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక రామారావుపేట లయన్స్‌క్లబ్‌లో మొక్కలను నాటి, ట్రీగార్డులు ఏర్పాటు చేయించారు. నేరెళ్ల మురళి, రీజియన్ చైర్‌పర్సన్ మేడిశెట్టి వెంకటరమణ, వేదుల శిరీష తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఎంఏఓ రాజేష్

కరప: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గించుకోవచ్చని ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. కొరిపల్లిలో బుధవారం నిర్వహించిన పొలంబడిలో ఆయన రైతులకు సూచనలుచేశారు. అవసరం మేరకే ఎరువులు వాడాలన్నారు. ద్రవరూపంలో ఉండే నానో యూరియాను స్ప్రే చేయవచ్చన్నారు. సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవిశెట్టి సూర్యప్రకాష్, మాజీ సర్పంచ్ ఆర్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

కాకినాడ రూరల్: ఐసీడీఎస్ కాకినాడ రూరల్ పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు (హెల్పర్స్) నోటిఫికేషన్ జారీ అయ్యింది. కాకినాడ రూరల్ మండలంలో మూడు, కరప మండలంలో రెండు హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మి, సూపర్‌వైజర్ పద్మశ్రీ బుధవారం విలేకరులకు తెలిపారు. సూర్యారావుపేట (బీసీ ఏ), తూరంగి (ఎస్టీ), పండూరు (ఓసీ జనరల్), కరప (ఓసీ జనరల్), పెనుగుదురు (ఎస్సీ) రిజర్వు కావడంతో ఆయా కేటగిరీల వారు సర్పవరంలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద దరఖాస్తులు స్వీకరించి ఈ నెల 19వ తేదీలోపుగా అందజేయాలని సీడీపీఓ, సూపర్‌వైజర్ సూచించారు.

బావమరిది చేతిలో బావ హత్య

కాకినాడ క్రైం: మద్యం మత్తులో ఓ వ్యక్తి సొంత బావనే హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ బుడంపేటకు చెందిన కోనాడ శ్రీను (48)కి కాకినాడకు చెందిన మల్లేశ్వరితో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. కాకినాడ డీప్ వాటర్ పోర్టులో శ్రీను ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగానే అత్తగారికి టిఫిన్ పట్టుకుని బుడంపేటలోని ఆమె ఇంటికి వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బావమరిది కొండపల్లి గొల్లబాబు తన తల్లికి టిఫిన్ ఎందుకు తెచ్చావని బావ శ్రీనుతో వాదనకు దిగాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న గొల్లబాబు ఇనుప వాటర్ పైప్‌తో శ్రీను తలపై కొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడితో పాటు అతడికి సహకరించిన నాగుల సతీష్‌పై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పాస్ అయిపోకు డ్రైవరన్నా!

- విద్యార్థులపై వాత్సల్యం చూపవూ..
- పాసుగాళ్లే అనే ఉదాసీనత తగదు
- ఆలస్యానికి మూల్యం చెల్లిస్తున్నారు
- తరగతులు వృథా.. ఆపై ఫైన్లు..
- గేట్లు మూసివేతతో అవస్థలు
- ఆర్టీసీ అధికారులూ.. ఓసారి చూడండి



నాగమల్లితోట జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఆరుబయట ఉన్న విద్యార్థులు

బాలాజీచెరువు: పిల్లలన్నాక అల్లరి సహజం. మితిమీరితే ఎవరికైనా చిరాగ్గానే ఉంటుంది. ఆ పిల్లలు కాలేజీ పిల్లలైతే.. అమ్మో ఒక్కొక్కడూ ఒక్కొక్క పిడుగు. అయినా సరే ఆ వయసులో కాకపోతే ఇంకెప్పుడు చేస్తారు అల్లరి పనులు? కళాశాలలు, విద్యా సంస్థలు ప్రారంభ, ముగింపు వేళల్లో బస్టాపుల్లో వీరి సందడి అంతా ఇంతా కాదు. కిలకిలలు, గలగలలు, బైబైలు, హ్యాంగింగ్‌లు, గేట్ల వద్ద వేలాడ్డాలు, హీరోయిజాల ప్రదర్శనలు అబ్బో.. మామూలుగా ఉండదు. ఈ సందడంతా నిత్యం సాయంత్రం వేళల్లో ఒక్క గంట.. మహా అయితే రెండు గంటల ప్రాంతంలో ఆయా విద్యా సంస్థల మీదుగా వెళ్లే బస్సుల్లో ఉంటుంది. ఈ కాసేపైనా వారి అల్లరిని తట్టుకోలేకపోతే ఎలా.. ఆ వయసు దుడుకుతనాల్లోంచి వచ్చిన వారే కదా ఇప్పటి పెద్దవారంతా. వారి అల్లరి భరించలేక.. వీరంతా బస్‌పాస్ ఉన్నవాళ్లే.. వారి వల్ల డబ్బులేమీ రావు అనుకోవడం అన్యాయమే కదా? నిజానికి వారి బస్‌పాస్ డబ్బులు ఆర్టీసీ సంస్థకు ముందస్తు చెల్లింపు రూపంలో వచ్చిన డిపాజిట్టే కదా? మరి ఆ పిల్లలపై ఉదాసీనత ఎందుకు? డ్రైవరన్నా ఆలోచించన్నా.. ప్లీజ్!

పాస్ హోల్డర్లన్న నెపంతో చాలామంది ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థులను నిర్లక్ష్యంగా చూస్తున్నారనేది నిర్వివాదాంశం. వీరి వ్యవహార శైలి వల్ల విద్యార్థులు సమయానికి తరగతులకు చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలైతే ఫైన్‌లు వేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల వారు గేట్లు మూసేస్తున్నారు. మగాళ్లు ఎలాగోలా దూకేసి లోపలికి వెళ్లిపోతున్నా.. విద్యార్థినులు మాత్రం ఆయా కళాశాలల గేట్లు దూకే క్రమంలో గాయాలపాలవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో నగరంలో ఉన్న పీఆర్ ప్రభుత్వ, ఐటీఐ, జేఎన్‌టీయూ, ఏపీటీ వంటి కళాశాలలకు సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సకాలంలో బస్టాప్‌లకు వచ్చినా బస్సులు ఆపకపోవడంతో వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. నగరంలో ఆర్టీసీ బస్సులు వచ్చే బాలాజీచెరువు, భానుగుడి పద్మప్రియ కాంప్లెక్స్, ఇంద్రపాలెం బ్రిడ్జి, రామారావుపేట, భానుగుడి దుర్గమ్మ గుడి, కోకిల సెంటర్ వంటి ప్రాంతాలలో ఒకప్పుడు దాతలు నిర్మించిన బస్‌షెల్టర్లు ఉండటంతో అక్కడ మాత్రమే బస్సులు నిలిపేవారు.



జిల్లా ప్రజా రవాణాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రమేణా ఆటోలు రావడంతో బస్ షెల్టర్లు కొన్ని నిరుపయోగంగా మారడం, మరి కొన్ని చోట్ల తొలగించడంతో ప్రయాణికులకు నీడ లేకుండా పోతోంది. దీంతో ఒక పక్క నిలవడానికి షెల్టర్ లేకపోవడంతో పాటు బస్సులు నిలపకపోవడంతో అటు ప్రయాణికులతో పాటు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్మార్ట్‌సిటీ నిధులతో పాటు దాతలు బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసినా అక్కడ బస్‌లు నిలపడానికి అనువుగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. నగరానికి నడిబొడ్డున ఉండే బాలాజీచెరువు సెంటర్, అలాగే భానుగుడి, కోకిల సెంటర్‌లో ఆదిత్య, ప్రగతి, చైతన్య, నారాయణ, వంటి కళాశాలలకు నిత్యం వేలాది విద్యార్థులు సాయంత్రం ఆర్టీసీ బస్ కోసం నిరీక్షిస్తుంటారు. ఐటిఐ, జేఎన్‌టీయూకే విద్యార్థుల అవస్థలైతే చెప్పనక్కర్లేదు. బస్ పాసువాళ్లే కదా అనే నిర్లక్ష్యంతో బస్సులు ఆపకపోవడంతో నాగమల్లితోట జంక్షన్ వద్దకు దాదాపు రెండు వందల మంది విద్యార్థులు కాలి నడకన వస్తుంటారు. వీరి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని విద్యార్థులు, బస్‌పాస్ దారులు కోరుతున్నారు.

ఈ విషయమై ప్రజా రవాణాధికారి శ్రీనివాస రావును వివరణ కోరగా విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేక సర్వీస్‌లు నడుపుతామని హామీ ఇస్తున్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం



బస్ పాసులున్నా బస్సులు ఆపడం లేదు. దీంతో నడవడమో లేక ఏవరినైనా లిఫ్ట్ అడిగో కాంప్లెక్స్‌కు చేరుకుని బస్సు ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రయాణికులుంటేనే బస్సులు ఆపుతున్నారు. విద్యార్థులు ఎక్కువగా కనబడితే బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారు. దీనిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. – ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

వృద్ధులకు కంటి పరీక్షలు



పాతర్లగడ్డలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరప: వృద్ధుల కంటి చూపు పరిరక్షణకు నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు అన్నారు. పాతర్లగడ్డ పంచాయతీ కార్యాలయంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 60 ఏళ్లు దాటిన వారందరూ శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తారన్నారు. వైద్యుడు చంద్రశేఖర్ కంటిపరీక్షలు నిర్వహించారు. ఎంఎస్‌హెచ్‌పీ ఎస్.నవ్యత, ఏఎన్ఎం జె.వివేశ, ఆశా వర్కర్ ఎం.వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

27న క్రియా యోగ సాధన దీక్ష

కాకినాడ సిటీ: ఈనెల 27వ తేదీన బాలాజీ చెరువు సెంటర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు సుషుమ్న క్రియా యోగ దీక్ష నిర్వహిస్తున్నట్లు దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్, సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ ఎస్ ప్రశాంతి, కార్యదర్శి ఎస్ శిరీషదేవి బుధవారం తెలిపారు. సుషుమ్న క్రియా యోగ దీక్ష కార్యక్రమానికి ప్రపంచ ప్రఖ్యాత గురువులు ఆత్మానందమయి అమ్మ హాజరై సంపూర్ణ ఆరోగ్య సాధనపై స్వయంగా అనుగ్రహిస్తారన్నారు. ఈ సాధన వల్ల ఒత్తిడి తట్టుకునే శక్తి, మానసిక ప్రశాంతత, ఆరోగ్య జీవన విధానం, ఉత్సాహం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయన్నారు.

పండ్ల ద్వారా పౌష్టికాహారం పంపిణీ

- ప్రతి పాఠశాలలో మొక్కలు సిద్ధం
- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- సంపూర్ణ పోషకయోజన ప్రారంభం



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: విద్యార్థుల్లో పౌష్టికాహారలోపాన్ని అధిగమించేందుకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పండ్ల మొక్కలను పెంచి వాటిని ఆ స్కూల్‌లోని విద్యార్థులే వినియోగించేందుకు సంపూర్ణ పోషణ యోజనను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక రామారావుపేటలోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఈ మేరకు మొక్కలు పెంచే కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. 'ఫిల్ ద న్యూట్రీషియన్ గ్యాప్' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మామిడి, అరటి, రేగు, సీతాఫలం, జామ, వాటర్ యాపిల్, నిమ్మ, నేరేడు, బాదం, ఉసిరి, పెద్ద ఉసిరి, సపోట, బొప్పాయి, పనస వంటి 15 రకాల పండ్ల మొక్కలను పాఠశాలల్లో నాటనున్నట్లు చెప్పారు. నగరంలోని 90 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ప్రస్తుతం మొక్కల పెంపకానికి 60 పాఠశాలలు అనువైనవిగా గుర్తించామన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు రోటరీ క్లబ్ వంటి సేవా సంస్థలు సహకారం తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు. అలాగే వలంటీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు కూడా తోడ్పడతారన్నారు. ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ సిరిల్ మాట్లాడుతూ నెలాఖరు నాటికి అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తిచేస్తామన్నారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, తహసీల్దార్ సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య సలహాలు పాటించాలి



గర్భిణులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

కరప: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, పోషకాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావులు సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ పి.ఆశ వైద్య పరీక్షలుచేసి, సూచనలు చేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, సీహెచ్ఓ వై.రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని 6 ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో గర్భిణులకు డాక్టర్ ఎంకే.సౌజన్య, డాక్టర్ ఎ.సింధూర వైద్య పరీక్షలు చేశారు.

వైద్యసేవలందించాలి

పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ, ప్రజలకు వైద్య సేవలందించాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి పీహెచ్‌సీలో ఎక్కువ ప్రసవాలు జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ పీహెచ్‌సీ నిర్వహణకు వస్తున్న, నిధులు, చేస్తున్న ఖర్చులను వివరించారు. పలువురి సిబ్బంది వేతనాలు పెంచేందుకు కమిటీ తీర్మానించింది.

సీఎం జగన్‌తోనే బీసీల ఆత్మగౌరవం

- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- యాదవుల కమ్యూనిటీ హాలు ప్రారంభం



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న యాదవ సంఘ ప్రతినిధులు

కాకినాడ: సంప్రదాయాలకు విలువనిస్తూ, ఆచారాలను గౌరవిస్తూ బీసీ వర్గాలకు సీఎం జగన్ అన్ని విధాలుగా అండగా నిలిచారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్ గొల్లపేటలో రూ.17.5 లక్షలతో నిర్మించిన ఆవుల సుబ్బారావు యాదవ కమ్యూనిటీహాలును ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ టీడీపీ హయాంలో యాదవులకు వంశపారంపర్యంగా ఉన్న సన్నిధి గొల్లను చంద్రబాబు పక్కన పెట్టారని, సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రక్రియను యథావిధిగా కొనసాగిస్తున్నారన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు పద్మశాలీ ఆడపడుచులతో అమ్మవారికి సారె పంపించే విధానానికి శ్రీకారం చుట్టి బీసీ వర్గాల పట్ల తనకున్న ఆత్మీయతను జగన్ చాటుకున్నారన్నారు. సాంప్రదాయాలకు విలువనిస్తూ, ఆచారాలను గౌరవించే ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. గొల్లపేటలో ముంపు సమస్య నివారణకు శాశ్వత ప్రాతిపదికన రిటెయినింగ్ వాల్ నిర్మాణానికి రూ.20 కోట్లు ఖర్చు అవుతుందని సీఎంకు వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రస్తుతం నిర్మించిన కమ్యూనిటీహాలు పైభాగంలో జైపూరు నుంచి కృష్ణుని పాలరాతి విగ్రహాన్ని రప్పించి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి మాట్లాడుతూ సీఎంకు మద్దతుగా నిలిస్తే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లిరాజబాబు, అఖిలభారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మన్నే నాగేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యే ద్వారంపూడి, విశ్రాంత ఏఎస్పీ ఆవుల సుబ్బారావు, డాక్టర విఠల్‌ను ఘనంగా సత్కరించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీఈ సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షలు

కాకినాడ: గడపగడపకు ప్రభుత్వంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. స్థానిక 38వ డివిజన్ ఎల్విన్‌పేట, గొల్లపేట ప్రాంతంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించి నాలుగేళ్ల కాలంలో ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా, వాటి సత్వర పరిష్కారానికి సానుకూల దృక్పథంతో ఈ నిధులను సీఎం జగన్ కేటాయించారన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామంటున్నారు. డివిజన్ ఇన్‌చార్జి యార్లగడ్డ పద్మజ రాంబాబు, చౌదరి, కన్వీనర్లు, డీఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



గొర్రిపూడిలో లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కన్నబాబు
- గొర్రిపూడిలో గడప గడపకూ

కరప: పేదల జీవితాలలో వెలుగులు నింపాలన్న సంకల్పంతో సీఎం జగన్ అమలుచేస్తున్న నవరత్న, సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. గొర్రిపూడిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించి నాలుగేళ్లుగా పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీఅధ్యక్షుడు చీకాల అప్పలరాజు తదితర పార్టీ నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

త్యాగధనులను స్మరించుకుందాం

రేపటి మన భవిష్యత్ కోసం ఈ రోజును త్యాజించి మనకు స్వేచ్ఛనిచ్చిన వారికి రుణపడి ఉందామని, దేశకోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుందామని ఎమ్మెల్యే కన్నబాబు పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవ్‌లో భాగంగా స్థానిక నాయకులు, మండలస్థాయి అధికారులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు. పీటీ పుంత వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కన్నబాబు ఆవిష్కరించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మొక్కను నాటారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.అప్పారావు పాల్గొన్నారు.

కన్నబాబును కలసిన జాన్ వెస్లీ



ఎమ్మెల్యే కన్నబాబును కలసి మొక్కను అందజేస్తున్న జాన్ వెస్లీ

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జోనల్ ఇన్చార్జి జాన్ వెస్లీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసారు. ఈ నెల 4న ఆ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనను నియమించినట్లు, అన్ని విధాలా సహకరించాలని ఆయన కన్నబాబును కోరారు.

కార్మికుల అక్రమ అరెస్టులపై నిరసన

కాకినాడ సిటీ: కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన ఛలో కలెక్టరేట్ భగ్నం చేస్తూ పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్ ఒక ప్రకటనలో ఖండించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని, మణిపూర్, హర్యానా రాష్ట్రాలో హింసను అరికట్టి, బాధితులను ఆదుకోవాలని వారు ఆందోళన చేశారు.

మహేష్‌బాబు జన్మదిన వేడుక

కాకినాడ: సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదిన వేడుకలను బుధవారం కాకినాడలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు విముక్తికాలనీలోని పేదలకు నూనె, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అభిమాన సంఘ అధ్యక్షుడు మోహన్ కర్రి, శివ, శైలేష్, భువనేశ్వర్, జీవ, సతీష్, చిన్న, ప్రసాద్, వీరేద్ర తదితరులు పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఆదివాసీ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బాబూరావునాయుడు

కాకినాడ రూరల్: నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం బుధవారం నిర్వహించింది. క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కమల్ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ప్రస్తుత ఓఎస్‌డి డాక్టర్ టి.బాబురావు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

చేనేత రంగానికి కేంద్రం చేయూత

బోట్‌క్లబ్: చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం చేయూతను అందిస్తోందని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిశోర్ అన్నారు. కాకినాడలో బుధవారం అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, సౌత్ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: అప్పుల బాధ తాళలేక ఒకవ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. వేళంగి శివారు కొప్పిశెట్టివారిపేటకు చెందిన గుబ్బల పెదవెంకట్రావు (50) అప్పులు చేసి, తీర్చలేక విరక్తి చెంది ఈనెల 8న పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్క పొలంవారు గుర్తించి రక్షించే యత్నం చేశారు. అతని కుమారుడు శ్రీను వచ్చి, అపస్మారక స్థితిలో ఉన్న వెంకట్రావును చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఎస్ఐ ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



యండమూరులో 'నా భూమి-నా దేశం' ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ సెల్ సభ్యులు

కరప: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సర్పంచ్ మార్నెళ్ల శ్రీనివాస్ (శివ) అన్నారు. మండలం యండమూరులో బుధవారం ఆజాదీ కా అమృత మహోత్సవ్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ర్యాలీ నిర్వహించి 'నా భూమి–నాదేశం', 'నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం' అంటూ నినాదాలలో చేస్తూ, ప్రజలను ఉత్తేజపరచారు. గ్రామంలో నాభూమి–నాదేశం శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. చెరువులలో, పంటపొలాల్లోని మట్టిని సేకరించి ఎంపీడీఓ కార్యాలయానికి పంపించారు. ఉప సర్పంచ్ పలివెల జానకిరామయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, షేక్ దరియా, మీసాల చక్రరావు, ఏపీఓ ఈ.వెంకటరమణ, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో..

బాలాజీచెరువు (కాకినాడసిటీ): జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్, యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్1, యూనిట్2, యూనిట్ 3ల ఆధ్వర్యంలో 'నా మట్టి–నా దేశం' కార్యక్రమంలో భాగంగా బుధవారం దత్తత గ్రామాలైన తిమ్మాపురం, అచ్చంపేట, ఉండూరులలో మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లోని మాజీ సైనికులను గుర్తించి వారిని ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సన్మానించారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ, అచ్చంపేట గ్రామ సొసైటీ ప్రెసిడెంట్ వీరంరెడ్డి వీరయ్య, ఉండూరు గ్రామ సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఆయా గ్రామాల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటడం ద్వారా కలిగే ఉపయోగాలను, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు, 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.